సాక్షి తిరుపతి

సోమవారం, 10, జూలై, 2023



రుచిగా.. శుచిగా.. భోజన 'వసతి'

జిల్లాలోని వసతిగృహాల్లో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు. ఇందుకోసం నిధులు విడుదల చేస్తున్నారు. –8లో



శ్రీరామ నీ నామమెంతో రుచిరా

తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఒకటో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా సాగింది. –8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	25
చిత్తూరు	33	25
తిరుమల	30	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

టూరిజం అభివృద్ధికి 'సెవెన్‌స్టార్'



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

తిరుపతి అర్బన్ : తిరుపతిలో సెవెన్‌స్టార్ హోటల్ రావడంతో టూరిజం మరింత అభివృద్ధి చెందనుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా గండికోట నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఓబెరాయ్ గ్రూప్ వారి సెవెన్‌స్టార్ హోటల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం పేరూరు వద్ద 20 ఎకరాల్లో రూ.250 కోట్లతో ఓబెరాయ్ గ్రూప్ హోటల్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. తొలిసారిగా జిల్లాలో ఏర్పాటు కానున్న సెవెన్‌స్టార్ హోటల్‌లో అంతర్జాతీయస్థాయి వసతులు కల్పించనున్నారని వివరించారు. విదేశీ పర్యాటకులు సైతం విడిది చేసేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. హోటల్ సమీపంలో 100 విల్లాస్ కూడా రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సర్పంచ్ కేశవులు, ఎంపీటీసీ సభ్యుడు చంద్రమోహన్, టూరిజం జిల్లా అధికారులు రమణప్రసాద్, గిరిధర్‌రెడ్డి, రూపేంద్రనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఎస్పీడీసీఎల్ ఈఈ కృష్ణారెడ్డి, డీపీఆర్‌ఓ బాలకొండయ్య పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు స్పందన ఉంటుందని, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని ఆయన సూచించారు.

విషాద యాత్ర

'ఒక్క రోడ్డు ప్రమాదం.. మూడు కుటుంబాలకు చెందిన ఆరుగురిని మృత్యుఒడికి చేర్చింది. దైవదర్శనానికి వచ్చి వెళ్తూ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో జరిగిన ఘోరప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు దుర్మరణం పాలవగా, అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు స్వల్పగాయాలతో బయటపడి మృత్యుంజయుడుగా మిగిలాడు.

- అతివేగం తెచ్చిన అనర్థం
- ఆరుగురిని బలిగొన్న రోడ్డు రక్కసి
- దైవదర్శనానికి వచ్చి తిరిగి వెళ్తూ తిరిగిరాని లోకాలకు
- శ్రీకాళహస్తిలో ఘోర రోడ్డు ప్రమాదం



లారీని ఢీకొని ధ్వంసమైన కారు



ఘటనాస్థలంలో మృతదేహాలు

రేణిగుంట, శ్రీకాళహస్తి: విజయవాడ కృష్ణలంక బాలాజీ టవర్స్‌లో రమేష్‌బాబు(45), ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారులు రేవంత్, భరత్ నివసిస్తున్నారు. రమేష్‌బాబు భవన నిర్మాణ రంగంలో కూలీలకు అందించే లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరి పెద్ద కుమారుడు రేవంత్ బీటెక్ చదువుతుండగా, చిన్నకుమారుడు భరత్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రాజ్యలక్ష్మి సోదరి శ్రీలత(42) ఉయ్యూరులోని అక్కబజారులో నివాముంటూ అక్కడ క్యాటరింగ్ చేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకుని ఇంజినీరింగ్ చదివిస్తోంది. అలాగే రాజ్యలక్ష్మి స్నేహితురాలు వెంకటరమణమ్మ (38), ఆమె భర్త నరసింహమూర్తి(47), కుమార్తె అక్షయ(17) కూడా కృష్ణలంక ప్రాంతంలోనే నివసిస్తున్నారు. రమేష్‌బాబు, రాజ్యలక్ష్మి, భరత్(17), శ్రీలత, వెంకటరమణమ్మ, నరసింహమూర్తి, అక్షయ మొత్తం ఏడుగురు ఒకే కారులో శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి తిరుమలకు వచ్చారు. ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కారులో తిరుగుపయనమై, మార్గమధ్యంలోని శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుని అక్కడి నుంచి విజయవాడకు వెళ్లాలని నిర్ణయించుకుని తిరుమల కొండ దిగారు. తర్వాత తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు.

అతివేగం– సీటు బెల్ట్ లేకపోవడమే

అతివేగంగా రావడంతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఏ ఒక్కరూ సీటుబెల్ట్ పెట్టుకోలేదు. అప్పటి వరకు పిచ్చాపాటి మట్లాడుకుంటూ హాయిగా సాగుతున్న వారి ప్రయాణాన్ని రెప్పపాటులో జరిగిన రోడ్డుప్రమాదం తీరని విషాదంలోకి నెట్టింది.

మృత్యుంజయుడు భరత్

రాజేశ్వరి, రమేష్‌బాబు కుమారుడు భరత్ వెనుక సీటులో అలసిపోయి నిద్రిస్తున్నాడు. అయితే తాను ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై పెద్ద శబ్దం వచ్చింది. నిద్రలో నుంచి తేరుకుని చూసేలోపే చిన్నపాటి రక్తగాయాలున్నాయి. అతని కళ్లెదుట తల్లిదండ్రులిద్దరూ విగతజీవులుగా పడి ఉండడం, పెద్దమ్మ శ్రీలత, తోడుగా వచ్చిన కుటుంబానికి చెందిన ముగ్గురూ మృతి చెంది పడి ఉండడంతో భరత్ బోరున విలపిస్తూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కారులో ఇరుక్కున్న వారిని స్థానికులు బయటకు లాగి రక్షించే ప్రయత్నం చేశారు. నిమిషాల వ్యవధిలో సీఐ అంజూయాదవ్, సిబ్బంది చేరుకుని గాయాలైన భరత్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుల బంధువులకు సమాచారం అందించారు.

నరసింహ మూర్తి ఫ్యామిలీలో ముగ్గురూ చనిపోయారు. శ్రీలత భర్త సుధాకర్ కొన్నేళ్ల కిందట చనిపోయాడు.. ఇప్పుడు ఆమె కన్నుమూయడంతో కుమారుడు అనాథగా మిగిలాడు.

– రాజేశ్వరి, రమేష్ బాబు దంపతులు మృతి చెందడంతో కుమారులు ఇద్దరూ అనాథలయ్యారు.. వారిలో ఒకరు ప్రమాదం జరిగిన కారులో ఉండి మృత్యువు నుంచి తప్పించుకోగా, పెద్ద కుమారుడు రేవంత్ వీరితో పాటు రాకపోవడంతో ముప్పు తప్పించుకున్నాడు.

శ్రీకాళహస్తి సన్నిధికి మరికొద్ది దూరంలో..

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి మరికొద్ది నిమిషాల వ్యవధిలో చేరుకునేలోపే శ్రీకాళహస్తి పట్టణం, మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా విజయవాడ నుంచి హోసూరు వెళుతున్న మొక్కజొన్న లోడ్డుతో కూడిన లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం లారీ ముందు చక్రాల కిందకు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. కారు నడుపుతున్న రమేష్‌బాబు, పక్క సీటులో కూర్చున్న మూర్తి కారుసీటులోనే ఇరుక్కుని మృతి చెందారు. వెనుక సీటులో కూర్చున్న రాజ్యలక్ష్మి, శ్రీలత, రమణి, అక్షయ అక్కడికక్కడే మృతి చెందారు. భరత్ ఒక్కడే స్వల్పగాయాలతో బయటపడ్డాడు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు



మృతదేహాలను తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మృత్యు'మార్గం'

శ్రీకాళహస్తి–తిరుపతి మార్గంలో ఇటీవల కాలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పూతలపట్టు–నాయుడుపేట 6లేన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించడం కష్టంగా ఉంది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నెలరోజుల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి.

పెద్ద ప్రమాదాల్లో ఇది ఒకటి

ఈ మార్గంలో ఆరేళ్ల కిందట ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగిన ఘోర ప్రమాదంలో 16 మంది రైతులు ఇసుకపోరాటంలో అశువులు బాశారు.

- ఎనిమిదేళ్ల కిందట ల్యాంకో కర్మాగారం సమీపంలో టెంపో వాహనంలో వెళుతూ లారీ ఢీకొని ఐదురుగు భక్తులు మృతి చెందారు. ఇప్పుడు ఆరుగురు మృతి చెందడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.

పరామర్శ

మిట్టకండ్రిగ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో బయటపట్ట భరత్‌ను శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరామర్శించారు. భరత్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అతన్ని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. భరత్ త్వరగా కోలుకోవాలని తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను ప్రార్థించినట్టు తెలిపారు. పరామర్శించిన వారిలో పసల కుమారస్వామి, బాలశెట్టి నరసింహులు, మునిరెడ్డి, షఫీ ఉన్నారు.



భరత్‌ను పరామర్శిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

అర్హతే ప్రామాణికం.. ఇదే జగన్నినాదం

- పార్టీలు, కులాలకు అతీతంగా పథకాల అమలు
- విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- టీడీపీ నుంచి 80 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు, కార్యకర్తలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: రాష్ట్ర చరిత్రలో పార్టీలకు, కులాలకు, మతాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. పుంగనూరు మున్సిపాలిటీలో ఆదివారం 750 మంది వీధి వ్యాపారులకు రూ.30 లక్షలు విలువ చేసే సోలార్ దీపాలను చిత్తూరు, అనంతపురం ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్యతో కలసి పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు అందిస్తోందని గుర్తుచేశారు. ప్రస్తుతం అడిగిన వారందరికి పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పింఛన్లు ఇచ్చేవారని చెప్పారు. ఎవరికైనా కొత్త పింఛను రావాలంటే, పింఛను తీసుకుంటున్న వారు ఒకరు చనిపోతేనే ఇచ్చేవారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలను అందిస్తున్నామన్నారు. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని తెలిపారు. సురక్ష కార్యక్రమం ఈనెలాఖరు వరకు జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ఇంటి వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. గత ప్రభుత్వాల పరిపాలనకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా భావించి, ముందుకెళుతోందని స్పష్టం చేశారు. ఇలాంటి నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు.

పులివెందుల తరహాలో అభివృద్ధి

పుంగనూరు నియోజకవర్గాన్ని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. చిరు వ్యాపారాల కష్టాన్ని గుర్తించి మంత్రి సోలార్ లైట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు.

జగనన్న రికార్డు

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏముఖ్యమంత్రీ చేపట్టలేదని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. పుంగనూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సోలార్ దీపాలను వీధి వ్యాపారులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సోలార్ కంపెని వారు ఈ లైట్ల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు.


నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో కూడా సిమెంటు రోడ్లు, కాలువలు, ఓవర్ హెడ్‌ట్యాంకులు, ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు చేసిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబందేనని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 80 మంది

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో తెలుగుదేశం కార్యకర్తలు 80 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం పట్టణంలో పీఎల్ఆర్ పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు అఫ్సర్ ఆధ్వర్యంలో 80 మంది టీడీపీకి చెందిన కార్యకర్తలు చేరారు. వీరికి మంత్రి పెద్దిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమాల్లో సోలార్ ఎండీ కమలాకర్, నెట్‌క్యాప్ జీఎం ఎర్రమరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పట్టణ అధ్యక్షుడు కెఎస్ఏ.ఇష్తికార్ తదితరులు పాల్గొన్నారు.

డేటా సెంటర్ ఏర్పాటుకు వినతి



గూగుల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి/ తిరుపతి కల్చరల్ : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం గూగుల్ సీనియర్ ఇంజినీరింగ్ డైరెక్టర్ రామగోవింద రాజును వారు కలిశారు. ఈ మేరకు గూగుల్ సెంటర్ ఏర్పాటుకు తగిన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని విన్నవించారు.

గరుడునిపై 'సుందర' విహారం

- వైభవంగా ముగిసిన అవతారోత్సవాలు



స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువైన శ్రీసుందరరాజస్వామి వారు ఆదివారం రాత్రి గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామి వారికి మూడు రోజులుగా నిర్వహించిన అవతారోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఏటా జ్యేష్ఠమాసం శతభిషా నక్షత్రం రోజున ప్రారంభమై, ఉత్తరాభాద్ర నక్షత్రం రోజున ముగిసేలా స్వామి వారికి అవతారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామి వారిని ఉదయాన్నే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. మధ్యాహ్నం 2గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఉభయదేవేరీ సమేత శ్రీసుందరరాజస్వామివారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం దేవదేవేరులకు కనులపండువగా ఊంజల్‌సేవ జరిపించారు. అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై కొలువుదీర్చారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, భాస్కర్ నాయుడు, వీఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహా సంగ్రామం పేదలు, పెత్తందారుల మధ్యే

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుమల శ్రీవారిని ఆలయం ఎదుట డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుమల: రాబోయే మహాసంగ్రామం పేదలు, పెత్తందారుల మధ్యే ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను, దేవుడిని నమ్ముకుంటే చంద్రబాబు నాయుడు మాత్రం కోటీశ్వరులను, వెన్నుపోటు దారులను నమ్ముకుంటున్నారన్నారు. ప్రజలకు నిస్వార్థమైన సేవ అందిస్తున్న వారే మళ్లీ విజయ బావుటా ఎగురవేస్తారని చెప్పారు. ఎవరైతే దుర్మార్గంగా, అక్రమంగా నిలుస్తారో.. స్కీంలపై కడుపు మండి బాధ పడుతున్నారో వారిని ప్రజలు తిరస్కరిస్తారన్నారు.

రుచిగా.. శుచిగా.. భోజన 'వసతి'

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అదే క్రమంలో విద్యార్థులకు భోజన వసతులు కల్పించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతోంది. మెనూ ప్రకారం రుచిగా.. శుచిగా ఆహారం అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. కొత్త కొత్త వంటకాలను వండి వడ్డించేందుకు సర్వం సమకూరుస్తోంది. ఇంటిని మరిపించేలా నాణ్యమైన పోషకాహారం అందిస్తోంది.అలాగే ఇప్పటివరకు అరకొరగా ఉన్న డైట్.. కాస్మొటిక్ చార్జీలను సైతం పెంచడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- హాస్టళ్లలో నూతన మెనూ
- డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు
- పకడ్బందీగా అమలు చేస్తున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఎస్సీ, బీసీ వసతి గృహాలు మొత్తం 126 ఉన్నాయి. అందులో 8,672 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా హాస్టళ్లలో పిల్లలకు కమ్మని భోజనం అందించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందుకోసం నూతన మెనూ అమలు చేస్తోంది. అలాగే డైట్, కాస్మొటిక్ చార్జీలను సైతం పెంపుదల చేసింది. విద్యార్థులు ఆరోగ్యకరంగా చదువుకునే వెసులుబాటును కల్పించింది.

డైట్ చార్జీల పెంపు ఇలా..

3 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు గతంలో డైట్, కాస్మొటిక్ చార్జీలు రూ.1000 ఉండగా ఇప్పుడు రూ.1,150కి పెంచారు. 6–10 విద్యార్థులకు రూ.1,250 నుంచి రూ.1,400కి పెంచారు. ఇంటర్–పీజీ వరకు రూ.1,400 నుంచి రూ.1,600కు పెంపుదల చేశారు.



గూడూరు బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

కొత్త మెనూ ఇలా..

- **ఆదివారం :** ఉదయం పూరీ, బంగాళదుంప బఠాణీ కూర్మా, గుడ్డు, మిల్లెట్ చిక్కీ, మధ్యాహ్నం చికెన్ బిరియాని, రైతా, గోంగూర చట్నీ, సాయంత్రం సేమియా పాయసం, రాత్రి అన్నం, సాంబారు, క్యారెట్ పెసరపప్పుకూర, మజ్జిగ, అరటిపండు
- **సోమవారం :** ఉదయం పాలు, చింతపండు పులిహోరా, శనగపప్పుపొడి, చిక్కీ, సాయంత్రం ఉడికించిన బఠాణీ గుగ్గిళ్లు, రాత్రి అన్నం, కోడి గుడ్డు, టమాటా కూర, రసం, మజ్జిగ, జామపండు
- **మంగళవారం :** ఉదయం పాలు, ఇడ్లీ ,చట్నీ, చిక్కీ, సాయంత్రం రాగిలడ్డు, రాత్రి తాళింపు, అన్నం, చికెన్ కర్రీ, రైతా, గోంగూర, చట్నీ, కోడి గుడ్డు, అరటి పండు
- **బుధవారం :** ఉదయం పాలు, జీలకర్ర అన్నం, కూరగాయల కూర, చిక్కీ, సాయంత్రం ఉడికించిన అలసంద గుగ్గిళ్లు, రాత్రి అన్నం, గుడ్డు, టమాటా కర్రీ, సాంబారు, మజ్జిగ, జామపండు
- **గురువారం :** ఉదయం పాలు, గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, చిక్కీ, సాయంత్రం మరమరాల మిక్చర్, రాత్రి అన్నం, బెండకాయ ఫ్రై, సాంబారు, మజ్జిగ, గుడ్డు, అరటిపండు
- **శుక్రవారం :** ఉదయం పాలు, పెసర పొంగల్, చట్నీ, చిక్కీ, సాయంత్రం పచ్చిశనగ గుగ్గిళ్లు, రాత్రి తాళింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర చట్నీ, గుడ్డు, రైతా, మజ్జిగ, జామపండు
- **శనివారం :** ఉదయం పాలు, ఇడ్లీ, చట్నీ, చిక్కీ, సాయంత్రం రవ్వ కేసరి, రాత్రి అన్నం, దొండకాయ కూర, పాలకూర పప్పు, మజ్జిగ, అరటి పండు
- ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్నం పాఠశాలల్లోనే జగనన్న గోరుముద్ద కింద భోజనం అందిస్తారు.

జిల్లా సమాచారం

ఎస్సీ వసతి గృహాలు	:	63
విద్యార్థుల సంఖ్య	:	4,107
బీసీ హాస్టళ్లు	:	63
విద్యార్థుల సంఖ్య	:	4,565

పక్కాగా మెనూ అమలు



వసతిగృహాల్లో కొత్త మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదు. వార్డెన్లు ఏమాత్రం అలసత్వం వహించిన కఠిన చర్యలు తప్పవు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు భోజనం వడ్డించాలి.

- చెన్నయ్య, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి

పకడ్బందీ నిఘా



ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త మెనూను వార్డెన్లు అమలు చేయాలి. దీనిపై పకడ్బందీ నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నాం. మంచి ఆహారం అందిస్తుండడంతో పిల్లలకు చక్కగా చదువుకుంటారనే ప్రభుత్వ ఉద్దేశం. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నాం.

- భాస్కర్‌రెడ్డి, బీసీ హాస్టల్స్ జిల్లా అధికారి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,700
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,415

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

పుతిగే మఠం పీఠాధిపతికి చిన్న మర్యాద



శ్రీవారి ఆలయంలో పుతిగే మఠం పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ

తిరుమల: ఉడిపిలోని పుతిగే మఠం పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీకి ఆదివారం టీటీడీ శ్రీవారి ఆలయం తరపున చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం ఇస్తికఫాల్ స్వాగతం పలికి శ్రీ స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గడ్కరీ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 12వ తేదీన జిల్లాకు రానున్నారు. రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ మేరకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఏర్పాట్లపై సమీక్షించారు. కేంద్రమంత్రి 13న ఉదయం తిరుపతిలోని తారకరామ స్టేడియంలో కృష్ణపట్నం పోర్టు రహదారులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం రేణిగుంట- నాయుడుపేట జాతీయ రహదారి ఎన్‌హెచ్–71 మార్గంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా మొక్కలు నాటే పాన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు కల్పించాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పక్కాగా ప్రోటోకాల్ విధులు నిర్వర్తించాలని కోరారు. సమావేశంలో జేసీ డీకే బాలాజీ, విజయవాడ జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి రాకేష్ కుమార్ సింఘ్, జాతీయ రహదారులు నెల్లూరు పీడీ దేవేశ్ గోయల్, తిరుపతి పీడీ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఎస్‌డీసీ భాస్కర్ నాయుడు, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

చంద్రబాబు మాటలు నమ్మే స్థితిలో ఎవరూ లేరు

తిరుమల: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఆదివారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో బాబు యుక్తులు, కుట్రలు ప్రజలకు తెలుసని, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాలేని నాయకుడిగా చంద్రబాబు మిగిలిపోతున్నారని తెలిపారు. మేనిఫెస్టోను భగవద్గీత, కురాన్, బైబిల్‌గా సీఎం జగన్ చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు ఉండబోవన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ చేసేది వారాహి యాత్ర కాదని నారాహయాత్రని విమర్శించారు.



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

భగవద్గీతతో ఆధ్యాత్మిక జీవనం



అనుగ్రహభాషణం చేస్తున్న ఉడిపి పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీ

తిరుపతి కల్చరల్ : సమాజంలో ఆధ్యాత్మిక జీవనానికి భగవద్గీతే చక్కటి మార్గమని ఉడిపి పుత్తిగే పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామిజీ వెల్లడించారు. ఆదివారం తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరం ఆవరణలోని సమావేశ మందిరం వద్ద వితల పూజ, కోటి గీతా లేఖన యజ్ఞం చేపట్టారు.ఈ సందర్భంగా స్వామీజీ వితల పూజ కోటి భగవద్గీత యజ్ఞం విశిష్టతను వివరించారు.భక్తులందరూ ప్రతి రోజూ గీతలోని ఒక శ్లోకం రాయాలని సూచించారు. భగవద్గీత శ్లోకాలను రాసిన పుస్తకాలను ఉడిపి శ్రీకృష్ణుడి ఆలయంలో సమర్పించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. అనంతరం ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతీ రమణ దాస్, కార్యదర్శి లీలాపారాయణదాస్, ఇస్కాన్ ప్రతినిధులు స్వామీజీకి రాధాకృష్ణుల చిత్రపటం, ప్రసాదం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి, కోటి గీత లేఖన యజ్ఞం ప్రోగ్రామ్ కన్వీనర్ కొత్తపల్లి అజయ్‌కుమార్, కో–కన్వీనర్ హరిప్రసాద్, వేశాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి విజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, ఏపీ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు రతీష్ ఆచారి, ప్రసన్న, చందన్ కారత్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అజయ్‌కుమార్

తిరుపతి క్రైం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు, తిరుపతి నగర కార్పొరేటర్ ఉమా భర్త అజయ్ కుమార్‌పై శనివారం రాత్రి టీడీపీ నేతలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు.. ఆటోనగర్‌కు చెందిన తెలుగు యువత నేత నాని చౌదరి, మంగళానికి చెందిన రౌడీషీటర్ నాని అలియాస్ సతీష్, 15మంది అనుచరులతో కలిసి అజయ్ కుమార్ కార్యాలయానికి వచ్చి గొడవ చేశారు. నిన్ను చంపేస్తేనే 2, 3, 4 డివిజన్లలో టీడీపీకి పట్టు వస్తుందని బెదిరించడమే కాకుండా దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితులు రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. దాడిలో రౌడీషీటర్ సతీష్‌కు కూడా స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేరాడు. నాని చౌదరి పరారీలో ఉన్నాడు. నాని అలియాస్ సతీష్‌పై గతంలో హత్యకేసులో నిందితుడుగా ఉన్నాడు. నాని చౌదరి కారు చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా అలిపిరి పోలీస్ స్టేషన్ రికార్డుల్లో ఉండడం గమనార్హం.

మినీ లారీ బోల్తా : ఒకరు మృతి



రోడ్డుపై పడిన మినీ లారీ, దుంగలు

చిల్లకూరు : మండలంలోని నెలబల్లి రెట్టపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఓ మినీ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. డ్రైవర్ శ్రీనివాసులు, సైదాపురం మండలం లింగసముద్రానికి చెందిన శంకరయ్య (32) మినీ లారీలో గూడూరులోని ఓ టింబర్ డిపోకు నాయుడుపేట నుంచి టేకు దుంగలను తీసుకుని బయలుదేరారు. మార్గం మధ్యలో టైరు పగిలిపోవడంతో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో టేకు దుంగలపై కూర్చుని ఉన్న శంకరయ్య రోడ్డుపై పడిపోయాడు. దుంగలు పైన పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ప్రైవేట్ వాహనంలో గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారిపై లారీ పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మొబైల్ వాహన సిబ్బంది అజయ్, సురేష్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మొదటి ఘాట్ రోడ్డులో కారు..



ప్రమాదానికి గురైన కారు

తిరుమల : మొదటి ఘాట్ రోడ్డులో కారు బోల్తాపడి అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్, దీవాస్కుకు చెందిన హిమాన్షు దూబే శ్రీవారి దర్శనార్థం తన స్నేహితుడితో కలిసి తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం కారులో తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరాడు. వీరి కారు జింకల పార్కు సమీపంలో వెళుతుండా ఆకస్మాత్తుగా ఓ జింక అడ్డంగా రావడంతో దాన్ని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తాపడి అటవీప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో భక్తులు సురక్షితంగా బయపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొని టిప్పర్..



పొలాల్లో పడిపోయిన టిప్పర్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు–నాగలాపురం రోడ్డులో వడ్డిపాళెం వద్ద కంకర లోడ్ వస్తున్న టిప్పర్ ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. దీంతో సబ్ స్టేషన్‌లో ఫ్యూజు పోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోవడంబతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిద్ర మత్తులో టిప్పర్ నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ తెలిపాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విద్యుత్ సరఫరాకు దాదాపు పది గంటల అంతరాయం ఏర్పడింది.

శ్రీరామ నీ నామమెంతో రుచిరా



పారాయణం చేస్తున్న పండితులు

– రామనామస్మరణతో సాగిన అఖండ పారాయణం

తిరుమల: తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఒకటో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా సాగింది. శ్రీ హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం రామనామస్మరణతో మార్మోగింది. ఇందులో 1 నుంచి 3 సర్గల వరకు గల 156 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు ఆచార్య రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, పీవీఎస్ఎన్.మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. పారాయణం ప్రారంభానికి ముందు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు ఉదయ్ భాస్కర్ బృందం, చివర్లో హైదరాబాద్‌కు చెందిన నాగరాజు బృందం భజన కీర్తనలను శ్రవణానందంగా ఆలపించింది. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ ఆచార్య కుప్పా శివసుబ్రమణ్య అవధాని, పండితులు పాల్గొన్నారు.



సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

రోడ్డుప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి

పిచ్చాటూరు : నాగలాపురం మండలం సురుటుపల్లె వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్‌కుమార్ మృతి చెందాడు. వివరాలు.. తిరుపతికి చెందిన సురేష్‌కుమార్ కడివేడులో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో బైక్‌పై స్నేహితుడు సతీష్‌తో కలిసి తమిళనాడులో ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో సురేష్ అక్కడికక్కడే మరణించాడు. సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హనుమంతప్ప తెలిపారు.



సురేష్ కుమార్ మృతదేహం